క్లుప్తంగా

నేటి నుంచి ఆదివాసీ శిక్షణ శిబిరాలు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలోని గిరిజన క్రీడా పాఠశాలలో 29, 30, 31వ తేదీల్లో ఆదివాసీ శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఇన్‌చార్జ్ భూక్యా కోట్యానాయక్ బుధవారం ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, ఎంఎల్‌సీ కోదండ రామ్‌లతోపాటు ప్రొఫెసర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో జూన్ 2న 11వ తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఏరియా ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి అన్నారు. బుధవారం జీఎం కార్యాలయంలో నిర్వహించిన వేడుకల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల ఏర్పాట్లను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ హనా సుమలత, డీజీఎం పర్సనల్ శివకేశవరావు, సీనియర్ పీఓ మురళి, సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం..

టేకులపల్లి: క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రజలంతా సహకరించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జ పార్వతి అన్నారు. బర్లగూడెంలో బుధవారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. క్షయ వ్యాధి లక్షణాలు, నివారణపై ప్రతీఒక్కరు అవగాహనతో ఉండాలని సూచించారు. దగ్గు, జ్వరం, తెమడ, ఆకలి మందగించి బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధికి గురైనట్లు నిర్ధారణ చేసుకోవాలని చెప్పారు. అటువంటి వారు వెంటనే సమీపంలోని పీహెచ్‌సీని సంప్రదించి వైద్యం పొందాలని చెప్పారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

పాల్వంచరూరల్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు మండలంలో బుధవారంతో ముగిశాయి. మండలంలో సహకార సొసైటీ ద్వారా ఐదు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.5.97 కోట్ల విలువ గల 26వేల క్వింటాళ్ల ధాన్యాన్ని 404 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు సొసైటీ కార్యదర్శి శ్రీను పేర్కొన్నారు. ఈసారి రైతులు కొనుగోలు కేంద్రాలకు అంతంత మాత్రంగానే విక్రయించగా ప్రైవేట్ వ్యాపారులకు అధికంగా విక్రయించారు.

సింగరేణి జాగృతి కోఆర్డినేటర్ల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి జాగృతి కార్పొరేట్ ఏరియా కోఆర్డినేటర్‌గా కార్పొరేట్ ఏరియాల్లో పనిచేస్తున్న వసికర్ల కిరణ్ కుమార్‌ను నియమిస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా కొత్తగూడెం ఏరియా సింగరేణి జాగృతి కోఆర్డినేటర్‌గా వనం వీరనాగేంద్ర సాగర్‌ను నియమించారు.

ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి

పాల్వంచ: పట్టణంలో బుధవారం టీడీపీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతిని నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు చేశారు. అడుసుమల్లి సాయిబాబా, రవి, కనగాల నారాయణరావు, రవి, భద్రం, నరిగే రమేష్ పాల్గొన్నారు.

ఇల్లెందు: ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా బుధవారం టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. పుట్టా ఉపేందర్‌యాదవ్, క్లింట్ రోచ్, పుట్ట అరుణ, తోలెం వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఆటలపోటీలు

ఇల్లెందు: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణిలో మహిళా ఉద్యోగులకు బుధవారం జీఎం కార్యాలయం ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించారు. సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్ మాట్లాడుతూ.. విజేతలకు జూన్ 2న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకుడు డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... జగన్నాథపురం వద్ద బుధవారం భద్రాచలం వైపు నుంచి బైక్‌పై వస్తున్న యువకుడు డివైడర్‌ను ఢీకొనడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు

కేసు నమోదు

పాల్వంచ: పాత కక్షల నేపథ్యంలో దాడి చేసిన ఐదుగురిపై కేసులు నమోదు అయ్యాయి. పోలీసుల కథనం.. పాండురంగాపురానికి చెందిన ఆటో డ్రైవర్ పిట్టల వసంత్ కుమార్ ఆటోను గజ్జబోయిన ప్రసాద్, ఉపేందర్, వెంకట్, ఉపేందర్, మరో వ్యక్తి కలిసి బుధవారం నటరాజ్ సెంటర్ వద్ద అడ్డగించారు. కర్రలతో ఆటో అద్దాలు పగులగొట్టారు. వసంత్ కుమార్‌పై దాడి చేశారు. వసంత్ కుమార్ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఇబ్బంది పడుతున్న 20 గ్రామాలు



జడలచింత - పాపకొల్లు గ్రామాల మధ్య రహదారికి ఇరువైపుల మట్టి కట్టలు

- ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు
- పట్టించుకోని అధికారులు



కోయకాలనీ వద్ద నిలిచిన వాన నీరు

జూలూరుపాడు: జూలూరుపాడు - పాపకొల్లు ఆర్ అండ్‌బీ రహదారి పనులు ముందుకు సాగడం లేదు. రెండు నెలల క్రితం ప్రారంభమైన డబుల్ రోడ్డు విస్తరణ పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల ముందు మట్టి కుప్పలు, డ్రెయినేజీలు పూడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022లో జూలూరుపాడు ప్రధాన సెంటర్‌లో తల్లాడ - భద్రాచలం రాష్ట్రీయ రహదారి విస్తరణ, డ్రెయినేజీలు, డివైడర్‌పై గ్రిల్స్, సెంట్రల్ లైటింగ్, జూలూరుపాడు - చీపురుగూడెం వరకు బీటీ రోడ్డు విస్తరణ కోసం డీఎంఎఫ్‌టీ రూ.5.22 కోట్లు మంజూరయ్యాయి.

ఈ నిధులతో జూలూరుపాడులో రహదారి విస్తరణ, డ్రెయినేజీలు, డివైడర్‌పై గ్రిల్స్, సెంటల్ లైటింగ్ పనులు పూర్తయ్యాయి. అయితే జూలూరుపాడు - చీపురుగూడెం రహదారి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ఈ నిధుల్లో రూ.88 లక్షలు ఉన్నాయి. ఈ నిధులతో జూలూరుపాడు - పాపకొల్లు రోడ్డులో 600 మీటర్ల మేర మండల కేంద్రం వెలుపల నుంచి ఈద్గా వరకు డబుల్ రోడ్డు విస్తరణ పనులను ఈ ఏడాది ప్రారంభంలోనే పూర్తి చేశారు. రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ మిగిలిన రహదారిని విస్తరించేందుకు ఎర్త్ వర్క్‌లో భాగంగా రెండు వైపులా మట్టి పోశారు. పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపుల మట్టిపోయడంతో వర్షం కురిస్తే ఇళ్లలో నుంచి వరదనీరు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. తల్లాడ - భద్రాచలం ప్రధాన రహదారి నుంచి జూలూరుపాడు గ్రామ శివారు వరకు చేపట్టాల్సిన సీసీ రోడ్డు పనులు ప్రారంభించకుండా గతంలోని డీఎంఎఫ్‌టీ నిధుల్లో మిగిలిన రూ.88 లక్షలతో బీటీ రహదారి పూర్తి చేశారు. అయితే ఈ రహదారిని 3-4 అడుగులు ఎత్తు పెంచి నిర్మించడంతో జూలూరుపాడు కోయ కాలనీ వద్ద కొద్దిపాటి వర్షానికే వరదనీరు నిలిచి చెరువును తలపిస్తోంది.

జూలూరుపాడు నుంచి వయా పాపకొల్లు మీదుగా చీపురుగూడెం వరకు సుమారు 12 కిలోమీటర్ల దూరం సింగిల్ బీటీ రోడ్డు ఉంది. ఈ రహదారిపై 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా మండల కేంద్రంలో పాపకొల్లు వెళ్లే రహదారి వెంట ఎస్‌బీఐ, టీజీజీబీ బ్యాంకులు ఉండటంతోపాటు, సహకార సంఘం కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి, పాఠశాలలు ఉండటంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. ఈ రహదారిలో జడలచింత, కొత్తూరు, పాపకొల్లు, భోజ్యాతండా, కొత్తూరు, రాజారావుపేట, పెద్దహరిజనవాడ, పుట్టకోట, బచ్చలకోయగూడెం, అన్నారుపాడు, గుండ్లరేవు, రాంపురంతండా, ఎలుకలొడ్డు, రాచబండ్లకోయగూడెం, గొల్లగూడెం, భేతాళపాడు, పీక్లాతండా, పంతులుతండా, టాక్యాతండా, చీపురుగూడెం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఈఈ గణేష్‌ను వివరణ కోరగా.. పనులు తిరిగి ప్రారంభించి సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇళ్లల్లోకి వరద చేరుతోంది...



రహదారి విస్తరణ పనులు నిలిచిపోవడంతో కొద్దిపాటి వర్షానికే వరదనీరు రోడ్డుపై నిలుస్తోంది. అంతేకాకుండా ఇళ్లల్లోకి చేరి ఒండ్రు పేరుకపోతోంది. ఇంటిలో నుంచి బయట అడుగుపెట్టే పరిస్థితి లేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మల్కం కిరణ్, కోయకాలనీ

డ్రెయినేజీలు నిర్మించాలి...



రహదారి ఎత్తు పెంచడంతో ఇళ్లు కిందికి అయ్యాయి. వాన వచ్చినప్పుడు వరద ఇళ్లల్లోకి వస్తోంది. రోడ్డు ఎత్తు 4 అడుగులు పెంచడం వల్లే ఈ ఇబ్బంది ఏర్పడింది. భారీ వర్షాలు, తుఫాన్లు వస్తే ఇళ్లు మునిగిపోతాయి. డ్రెయినేజీలు నిర్మించాలి.

– కిలారి అగ్గి రామయ్య, కోయకాలనీ

పనులు త్వరగా పూర్తిచేయాలి...



జూలూరుపాడు నుంచి పాపకొల్లు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. సింగిల్ రోడ్డు కావడంతోపాటు గుంతలు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

– దుగ్గినేని మధు, అన్నారుపాడు

మెడికల్ బోర్డ్‌కు రిఫర్ చేయండి..



జీఎం శాలేంరాజుతో మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం గైర్హాజరవుతున్న కార్మికుల కుటుంబీకులతో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని సర్వీసుతో నిమిత్తం లేకుండా మెడికల్ బోర్డ్‌కు రిఫర్ చేయాలని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏరియా జీఎం శాలేంరాజును కోరారు.

బుధవారం జీఎం కార్యాలయంలో జీఎంకు ఏరియా కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ... ఈ కౌన్సెలింగ్‌లో మెడికల్ రిపోర్టను పరిశీలించగా, వారిలో ఆపరేషన్ అయిన వారితోపాటు, అనేక దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నవారు తమ గోసను వివరించారని, వారిని మానవతా దృక్పథంతో పరిశీలించి మెడికల్ బోర్డ్‌కు రిఫర్ చేస్తే, వారికి బదులు వారి కుటుంబ సభ్యులు డ్యూటీలు చేసుకుని ఇంటి అవసరాలను తీర్చుకుంటారన్నారు. సానుకూలంగా స్పందించిన జీఎం సమస్యలను ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూస్తామని తెలిపారు.

కరోనాపై అప్రమత్తంగా ఉండండి..

సింగరేణి(కొత్తగూడెం): కరోనా విషయంలో సింగరేణి కార్మికులు నిర్లక్ష్యం చేయక, అప్రమత్తగా ఉండాలని, అందరూ విధిగా మాస్కులు ధరించాలని, ఈ విషయమై త్వరలో అన్ని ఏరియాల డీసీఎంఓలతో, హెల్త్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహిస్తామని, సింగరేణి ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గతంలో సింగరేణి ఆస్పత్రులలో గ్యాస్ కొరత వలన కార్మికులు ఇబ్బందులకు గురయ్యారని, ఈ నేపథ్యంలో యాజమాన్యం రూ.లక్షలు వెచ్చించి గ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం అది మరమ్మతులకు చేరుకుందని రిపేరు చేయాస్తామని చెప్పారు. అందరూ శానిటేషన్ పాటించాలన్నారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతీ సంవత్సరం కార్పొరేట్ వైద్యం కోసం సుమారు రూ.450 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



పీహెచ్‌సీ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

జూలూరుపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఆయుష్ కోఆర్డినేటర్ ప్రమీల అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో యోగాపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో శారీరక శ్రమ లేకపోవడం, ఆహార అలవాట్లలో మార్పులు తదితర కారణాలతో పలురకాల వ్యాధులు వస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆస్పత్రికి వచ్చే రోగులు, విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి, చైతన్య పరుస్తున్నామన్నారు. అనంతరం ఆరోగ్య జీవన యాత్ర వాకింగ్ బృందం సభ్యులు యోగా ముద్రలు వేసి, ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు.

కార్యక్రమంలో యునాని డాక్టర్ రాజేందర్, పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు వేల్పుల బోసు, బాపట్ల వెంకటేశ్వరరావు, ఎన్ సత్యనారాయణ రాజు, తాళ్లూరి నవీన్, బండ్ల వెంకటేశ్వర్లు, పెండ్యాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



మాట్లాడుతున్న ప్రసాద్ నాయక్

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీ ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్యా ప్రసాద్ నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ శ్రీనివాస నాయక్‌లు డిమాండ్ చేశారు.

బుధవారం జరిగిన సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి లంబాడా సామాజికవర్గం కీలకపాత్ర పోషించిందన్నారు. మంత్రివర్గంలో స్థానం కల్పించకపోతే ఈనెల 30వ తేదీన హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ఆందోళనా కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలోని 45 నియోజకవర్గాలలో లంబాడాలు అధికసంఖ్యలో ఉన్నారని, ఇప్పటివరకు మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో నూనావత్ రాంబాబు, భూక్య రవికుమార్, బట్టు వీరన్న, బోడ శ్రీనివాస్, బోడ మంగన్న, రమేష్, బాలు, హరీష్, నాగరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రిక్రూట్‌మెంట్ సెల్‌లో రోస్టర్ రిజిస్టర్ల తనిఖీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా కార్యాలయంలోని రిక్రూట్‌మెంట్ సెల్‌లో బుధవారం ఎస్టీ అసోసియేషన్ చీఫ్ లైజన్ ఆఫీసర్ల బృందం రోస్టర్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిక్రూట్‌మెంట్ సెల్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్‌లో రోస్టర్ పాయింట్‌ను అమలు చేశారా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చీఫ్ లైజన్ ఆఫీసర్, ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్యను అసోసియేషన్ బృందం సన్మానించారు. జీఎం పర్సనల్ (రిక్రూట్‌మెంట్ సెల్) బి.నికోలస్, అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు, భాస్కర్‌రావు, పంతులు, కే.హతీరామ్, ఎం.రాంబాబు, రిక్రూట్‌మెంట్ సెల్ డీజీఎం వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

నకిలీ సీడ్స్ విక్రయిస్తే కఠిన చర్యలు



పురుగు మందుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

జూలూరుపాడు: నకిలీ, హెచ్‌టీ కాటన్ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడ్డ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందని కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ అధికారులు కలిసి మండలంలోని పలు విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ... వానాకాలం సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా విత్తన, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్నామన్నారు. పురుగు మందుల వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేపట్టాలన్నారు. జూలూరుపాడు ఏఓ దీపక్ ఆనంద్, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌లు పురుగు మందులు, విత్తన, ఎరువుల దుకాణాల్లో సోదాలు చేశారు.

డీఏ, పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న తిరుపతి

ఇల్లెందు: ఎన్నికల ముందు ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా డీఏలు విడుదల చేయటం లేదని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి ఆరోపించారు. బుధవారం ఇల్లెందులో టీపీటీఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. ఐదు డీఏలు, వివిధ రకాల జీపీఎఫ్‌లు, సరెండర్ లీవ్, టీఎస్‌జీఎల్ఐ, సప్లిమెంటరీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుల పెన్షన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు నగదు రహిత వైద్య విధానం అమలు చేయాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఉపాధ్యాయుల ప్రమోషన్‌లు, బదిలీలు పూర్తి చేయాలని, ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని పదోన్నతి కల్పించాలని పేర్కొన్నారు. జూన్ 9న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాం, సర్వేశ్వరరావు, గుమ్మడి సమ్మయ్య, ఎం.ఆంథోని, కిషన్, దేవేందర్, ఇమ్మానియేల్, మోహన్‌బాబు, రాజారత్నం, జగన్, రాములు, రమేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతోనే యువత చెడుమార్గం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ కరంచంద్

పాల్వంచ: మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ అన్నారు. స్థానిక కొమ్ముగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాదకద్రవ్యాల వినియోగం, వాటివల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులు సిగరేట్, గంజాయి వంటి వాటి బారిన పడకుండా ఉపాధ్యాయులు వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. కోర్సు కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు మాట్లాడుతూ... అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎక్సైజ్ సీఐ సాంబమూర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాదకద్రవ్యాల వినియోగంపై కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రీసోర్స్ పర్సన్లు ప్రభుసింగ్, సంపత్‌కుమార్, శంకర్, మోహన్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగునీటిని ఆదా చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ

టేకులపల్లి: సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని బుధవారం తొమ్మిదోమైలు తండా గ్రామంలో నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ప్రతీరైతు తమ చేనులో నీటికుంట నిర్మించుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఈ సదుపాయాన్ని ఉచితంగా పొందవచ్చని వివరించారు. ఏడీఏ లాల్‌చంద్, కేవీకే శాస్త్రవేత్త శివ, ఏఓ అన్నపూర్ణ, ఏఈఓ రమేష్, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం వర్తింపజేయండి..

ఇల్లెందురూరల్: దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ రాజీవ్ యువ వికాసం పథకం వర్తింపజేయాలని బీఎస్పీ జిల్లా నాయుడు కాంపాటి నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. దరఖాస్తుల పరిశీనలకు గ్రామసభలు నిర్వహించకుండా అధికారులే జాబితాను సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల ప్రమేయంతో జాబితాకు తుదిరూపు ఇస్తున్నారన్న ఆరోపణలు యువతను కలవరపాటుకు గురిచేస్తోందన్నారు. అధికార పార్టీ కార్యకర్తలకే రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపజేస్తే ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

దూరమైన నిధులు.. భారమైన విధులు

- పారిశుద్ధ్యం మెరుగుదల కోసమంటూ కొత్త మార్గదర్శకాలు
- అమలుకు ససేమిరా అంటున్న కార్యదర్శులు
- పంచాయతీల్లో మరోసారి పెల్లుబుకుతున్న అసంతృప్తి



సుదిమళ్ల గ్రామపంచాయతీ కార్యాలయం

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం పెంపు లక్ష్యంగా ప్రస్తుతం చేపడుతున్న పనులకు నూతన హంగులద్దుతూ ప్రభుత్వం తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. నూతన విధానాన్ని వెంటనే అమలులోకి తేవాలని ఆదేశాల్లో పేర్కొంది. కానీ నిధుల దూరమై ఇప్పటికే అప్పుల పాలైన తమపై నూతన మార్గదర్శకాల పేరుతో మరింత భారం మోపడాన్ని కార్యదర్శులు జీర్ణించుకోలేకపోతున్నారు. మూడు రోజులుగా యాప్‌లో హాజరు నమోదు, డెయిలీ శానిటేషన్ రిపోర్టు (డీఎస్ఆర్) అప్‌లోడ్ పనులకు దూరంగా ఉంటున్నారు. కానీ విధులకు హాజరవుతూ మౌనంగానే నిరసన వెలిబుచ్చుతున్నారు.

నూతన మార్గదర్శకాలు..

పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, పచ్చదనం పెంపొందించే లక్ష్యంగా ప్రభుత్వం నూతన మార్గదర్శకలను జారీ చేసింది. దీని ప్రకారం.. నివాసాలు, విస్తీర్ణం, అందుబాటులో ఉన్న కార్మికుల సంఖ్య ఆధారంగా పంచాయతీలను రెండు, నాలుగు, ఆరు జోన్లుగా విభజించనున్నారు. జోన్ల వారీగా రొటేషన్ పద్ధతిలో పనులు చేపట్టి పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికోసం ప్రతీ జోన్‌లోనూ నిర్దేశించిన తేదీలలో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించడం, పొడి వ్యర్థాల నిర్వహణ, తడి వ్యర్థాల తొలగింపు, కాల్వల్లో చెత్త తొలగింపు, రహదారుల శుభ్రత వంటి పనులు చేపట్టాల్సి ఉంటుంది.

యాప్ నిర్వహణ మరింత భారంగా..

ఇప్పటి వరకు కార్యదర్శులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సెల్ఫీ దిగి జీపీ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే విధులకు హాజరైనట్లు నమోదవుతోంది. ప్రస్తుతం ఈ యాప్‌లో మాడ్యూల్స్ మార్చి నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా యాప్‌ను మార్చారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 8 గంటలకు విధులకు హాజరై పని ప్రదేశంలోనే ఫేస్ రికగ్నైజేషన్‌తో యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవాలి. అంతేకాకుండా ప్రతీరోజు ఎన్ని ఇళ్ల నుంచి చెత్త సేకరించారు.. అందులో తడి చెత్త ఎంత.. పొడి చెత్త ఎంత.. తూకం వేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం త్రాసు కొనుగోలు చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తూకం వేసి విక్రయించిన చెత్త ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ చేసి చలానను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

పేరుకుపోయిన అప్పుల భారం...


పల్లెల్లో పాలకవర్గాలు లేకపోవడంతో 14 నెలలుగా నిధులు మంజూరు నిలిచిపోయింది. దీనికి తోడు ఫ్రీజింగ్ కారణంగా పన్నుల రూపంలో వసూలైన నిధులను విడుదల చేసుకునే పరిస్థితి లేదు. దీంతో నిధుల లేమి సమస్య తీవ్రరూపం దాల్చి కొన్ని పంచాయతీలలో ట్రాక్టర్లు మూలన పడ్డాయి. మరికొన్ని చోట్ల కార్యదర్శులు అప్పులు చేసి పనులు సాగిస్తున్నారు. ఇప్పటి వరకు పంచాయతీల నిర్వహణ కోసం రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు అప్పులు చేసినట్లు పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

నూతన విధానంపై కార్యదర్శుల్లో అసంతృప్తి..

ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాలు, యాప్‌లపై పంచాయతీ కార్యదర్శుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు మూడు రోజుల క్రితం పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే నిధుల లేమితో ఇబ్బందిపడుతున్న తమకు నూతన మార్గదర్శకాలు మరింత భారంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. చెత్తసేకరణ, తూకం వేయడం, విక్రయించడం, యాప్‌లో అప్‌లోడ్ చేయడం, పని ప్రదేశంలో ఫేస్ రికగ్నైజేషన్‌తో యాప్‌లో అప్‌లోడ్ చేయడం వంటి విధులు తమ శక్తికిమించిన పనులుగా కార్యదర్శులు పేర్కొంటున్నారు. నూతన మార్గదర్శకాల అమలు కోసం.. ప్రతీ పంచాయతీకి వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రతీ 50మంది జనాభాకు ఒక వర్కర్‌ను నియమించాలని, 5జీ స్పీడ్‌తో హైస్టాండర్డ్స్ కలిగిన సెల్ ఫోన్ ఇవ్వాలని, నిర్వహణ కోసం ప్రతీనెల రూ.వెయ్యి చెల్లించాలని నిబంధనలను కార్యదర్శుల సంఘం నేతలు ఉన్నతాధికారులకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

పనిభారం పెంచేలా నూతన యాప్



నిధుల లేమితో సతమతమవుతున్న తరుణంలో నూతన యాప్, పని విధానంలో మార్పులు కార్యదర్శులకు భారంగా మారనున్నాయి. పంచాయతీరాజ్ శాఖలో ఎవరికీ లేని అటెండెన్స్ యాప్ కార్యదర్శులకు అమలు చేయడం సరైంది కాదు. తక్షణం నిధులు విడుదల చేసి అప్పుల భారం నుంచి కార్యదర్శులకు ఉపశమనం కల్పించాలి.

– ఇసంపల్లి వంశీకృష్ణ, జిల్లా కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం